సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సంపత్ వినాయక హుండీ ఆదాయం రూ.14.75 లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న శ్రీ వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు

సీతంపేట: శ్రీసంపత్ వినాయక ఆలయ హుండీ ఆదాయం గురువారం లెక్కించారు. 21 రోజులకు రూ.14.75 లక్షల నగదు, 820 మిల్లీ గ్రామ్స్ బంగారం, 56 మిల్లీ గ్రామ్స్ వెండి, 108 యూఎస్ఏ డాలర్లు, రియాల్ 1, బంగ్లాదేశ్ డాకా 20, చెక్ రూ.111లు వచ్చినట్టు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టి.అన్నపూర్ణ తెలిపారు. శ్రీ వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు హుండీ లెక్కించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.ప్రసన్నలక్ష్మి, ఆలయ వ్యవస్థాపక సభ్యులు టి.ఆర్.చోలన్ పాల్గొన్నారు.

వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

అల్లిపురం: చలువతోటలో గుట్కాలు, ఖైనీలు అక్రమంగా విక్రయిస్తూ, కులం పేరుతో దళిత మహిళలను వేధిస్తున్న వ్యాపారి కొండలరావుపై చర్యలు తీసుకోవాలని మహిళలు గురువారం వ్యాపారి ఇంటి ముందు ధర్నా నిర్వహించారు. వ్యాపారి కొండలరావు దళిత మహిళలు ఎవరూ తన ఇంటి ముందు నుంచి వెళ్లరాదని, కించపరుస్తూ, గొడవ పడుతున్నట్లు పలువురు మహిళలు ఆరోపించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో వ్యాపారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో మహిళలు అక్కడి నుంచి వెనక్కి మరిలారు.

అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల శ్రీ రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. వ్యాపారవేత్త గౌతమ్ దుర్గేష్ తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ రామారావు జంక్షన్, అచ్చియ్యమ్మపేట తదితర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, కార్యవర్గ సభ్యులు గణేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయసేవ అధికార చట్టంతో సామాజిక న్యాయం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి అధ్యక్షుడు వెంకటరమణ

విశాఖ–లీగల్: న్యాయసేవ అధికార చట్టం ద్వారా సామాజిక న్యాయం సాధ్యమవుతుందని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి అధ్యక్షుడు ఎం.వెంకటరమణ అన్నారు. గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మాట్లాడారు. ఉచిత న్యాయ సహాయం, కోర్టు ఫీజు మినహాయింపు తదితర సేవలను వెనుకబడిన వర్గాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

చిక్కిన చికెన్ మార్కెట్



అప్పులైపోయాం...

వ్యాపారులు ముందుగా కోళ్లు తీసుకొచ్చి దుకాణాల ముందు దించి వెళ్తారు. అమ్మకాల తర్వాత వాటి డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈసారి తీసుకొచ్చి ఇచ్చిన కోళ్లు అలాగే ఉండిపోయాయి. వ్యాపారం లేకపోయినా వాటికి డబ్బు చెల్లించకతప్పదు. హోల్‌సేల్ వ్యాపారులకు బాకీ పడ్డాను. బర్డ్ ఫ్లూ వల్ల చికెన్ వ్యాపారులంతా నష్టపోయాం. బేరాల్లేక ఇల్లు గడవడం కూడా కష్టంగా ఉంది. ఎంతో కొంత బేరం ఉంటేనే బిజినెస్‌లో ఏదైనా రొటేషన్ చేయగలం. పూర్తిగా వ్యాపారం లేకపోతే ఏమీ చేయలేం.

– యాసీన్, చికెన్ వ్యాపారి, కోటవీధి

జగదాంబ: బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ వ్యాపారాలు పడిపోయాయి. ఆదివారం వస్తే చాలు కిటకిటలాడే చికెన్ దుకాణాలు ఇప్పుడు జనాలు లేక బోసిపోతున్నాయి. బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకడం వల్ల జిల్లాలో అధికార యంత్రాంగం ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించడంతో ప్రజలు చికెన్ వైపు వెళ్లడంలేదు. దీంతో నాన్‌వెజ్ ప్రియులు చికెన్‌ను దూరం పెట్టి చేపలు, కొంచెం ఎక్కువే అయినా మటన్ వైపు వెళ్తున్నారు. దీంతో చికెన్ వ్యాపారులు బేరాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం పనిచేసే వాళ్లకు జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో ఉన్నారు.

ధరలు పెరిగే సమయంలో..

వాస్తవంగా చికెన్‌కు చక్కటి ధర పలికే సీజన్ ఇది. ప్రతి ఏటా ఎండలు ప్రారంభమయ్యే సమయంలో చికెన్ ధరలు పెరుగుతుంటాయి. కిలో రూ. 250 నుంచి రూ. 350 వరకు ఈ సీజన్‌లో ధర పలుకుతుంది. బర్డ్ ఫ్లూ కారణంగా ధరల పెరుగుదల మాట దేవుడెరుగు కనీసం వ్యాపారాలు కూడా సాగడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 35 వార్డు వెలంపేట, ఆర్ఆర్ఎంరోడ్డు, ఆర్సీం స్కూల్ ఏరియా, టౌన్ కొత్తరోడ్డు, 75 ఫీట్ రోడ్డు, బౌడారా రోడ్డు, ప్రసాద్‌గార్డెన్స్, కల్లుపాకలు, ఏవీఎన్ కళాశాల రోడ్డు, జీవీఎంసీ 39వ వార్డులోని లక్ష్మీనగర్, చిలకపేట, వన్ టౌన్ పోలీసుస్టేషన్ పరిధి, మౌలాలా పంజా, థామ్సన్ వీధి, కోటవీధి ప్రాంతాల్లో ప్రతి ఆదివారం పెద్ద ఎత్తున కోడి మాంసం విక్రయాలు జరుగుతాయి. బర్డ్ ఫ్లూ కారణంగా ఇప్పుడు ఆయా ప్రాంతాల్లోని చికెన్ దుకాణాలన్నీ వెలవెలబోతున్నాయి.



వ్యాపారం లేక సెల్‌ఫోన్ చూసుకుంటున్న వ్యాపారి

చేపలు, మటన్ దుకాణాలకు గిరాకీ..

కోడిమాంసం అమ్మకాలు తగ్గడంతో మేక మాంసం, చేపల విక్రయాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా చికెన్ కొనుగోలుకు ఆసక్తి చూపేవారు. తక్కువ ధరలో ఎక్కువ మొత్తం వస్తుందనే ఆశ ఉండేది. అయితే బర్డ్ ఫ్లూ కారణంగా అందరూ మేక మాంసం వైపు పరిగెత్తడంతో మటన్ వ్యాపారులు కిలో రూ. 1000 నుంచి రూ. 1200 వరకు పెంచేశారు. అయినప్పటికీ వినియగదారులు వెనక్కి తగ్గడంలేదు. చేపల ధరలు కూడా పెరిగిపోయాయి. రూ. 50 పెడితే ఒకపూట కూరకు వచ్చే చేపలు ఇప్పుడు రూ. 150 పెట్టినా రావడంలేదని వినియోగదారులు చెబుతున్నారు.



వినియోగదారులతో కిక్కిరిసిన చేపల మార్కెట్



తెరచుకోని చికెన్ దుకాణం

వదంతులు నమ్మొద్దు..



బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ తినకూడదని.. తినొచ్చని రకరకాల వదంతులు వ్యాపిస్తున్నాయి. వాటిని నమ్మకూడదు. ఉడికించి తినడం వల్ల బర్డ్ ఫ్లూ రాదని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. వాస్తవానికి 100 డిగ్రీల సెల్సియస్‌లో దేనినైనా ఉడికించి తినడం వల్ల వైరస్ చనిపోతుంది. అయితే కొన్ని రోజులు చికెన్ తినకుండా ఉంటే మేలు. ఒక్కసారి వైరస్ వచ్చిన తర్వాత దాని సమయం పూర్తి అయిన వరకు ఆ వ్యాధికారక క్రిమి తప్పకుండా ఉంటుంది. – **డాక్టర్ సందేష్‌కుమార్**, ప్రసాద్‌గార్డెన్స్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి

అమ్మకాలు పడిపోయాయి



బర్డ్ ఫ్లూ కారణంగా మా వ్యాపారాలు పడిపోయాయి. బిజినెస్ సాగక కష్టంగా ఉంది. ఆదివారం పెద్ద ఎత్తున వ్యాపారం జరిగేది. బర్డ్ ఫ్లూ భయంతో వినియోగదారులు చికెన్ కొనడంలేదు. అంతా చేపలు, మటన్ వైపు మళ్లిపోతున్నారు. షాపు అద్దె, కరెంట్, పనివారికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి. ఈ పరిస్థితి ఎప్పటికి మారుతుందో తెలియడంలేదు.

– **కేశవ్**, చికెన్ వ్యాపారి, వెలంపేట, జీవీఎంసీ 35వ వార్డు

అధినేతతో వాసుపల్లి భేటీ



పార్టీ అధినేత జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: శ్రీకాకుళం జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ట్రాన్సిట్ హాల్ట్‌లో భాగంగా గురువారం విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ అభివృద్ధిపై వారి మధ్య చర్చ జరిగింది. సంక్షేమ పథకాలేవీ ప్రజలకు చేరడంలేదని వాసుపల్లి జగన్‌కు తెలిపారు. దీనికి జగన్‌మోహన్‌రెడ్డి స్పందిస్తూ వైఎస్సార్‌సీపీ తరపున పార్టీ కార్యకర్తలంతా పోరాడి ప్రజలకు సేవ చేయాలని సూచించారు.



జగన్‌మోహన్‌రెడ్డితో ద్రోణంరాజు శ్రీవత్సవ్

పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్న నేతలు, కార్యకర్తలను గుర్తించి అనుబంధ సంఘాల బాధ్యతలు అప్పగించడంతో రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తున్నారని జగన్ దృష్టికి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏ వర్గానికి న్యాయం చేయలేదన్నారు.

మర్యాదపూర్వక కలయిక..

మహారాణిపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం విశాఖ విమానాశ్రయంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీవత్సవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇద్దరూ పలు విషయాలు చర్చించారు.

నాగవల్లీ దళార్చనలో దుర్గాలమ్మ



తమలపాకుల అర్చన అందుకున్న దుర్గాలమ్మ

దాబాగార్డెన్స్: పూర్ణామార్కెట్ దరి వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు ఈ నెల 27 వరకు కొనసాగనున్నాయి. 25న తొల్లేళ్ల ఉత్సవం, 26న మహా శివరాత్రి ప్రత్యేక పూజలు, ఆ రోజు రాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం, తొలిపూజ అత్యంత వైభవంగా జరపనున్నారు. వచ్చే నెల 6న మారువారం పండగ, పెద్ద ఎత్తున అన్నసమారాధన చేపట్టనున్నారు. ఉత్సవాల్లో భాగంగా దుర్గాలమ్మ అమ్మవారు గురువారం నాగవల్లీ దళార్చన (తమల పాకులతో) నిర్వహించారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. భవానీ మాలలు ధరించిన భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు. ప్రత్యేక కుంకుమ పూజలు, ప్రత్యేక అర్చనలతో పాటు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శాకంబరి అలంకరణలో దుర్గాలమ్మ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

గిరిజన ప్రాంతాల్లో ప్రేమ సమాజం సేవలు



పేద గిరిజనులకు రేషన్, దుప్పట్లు అందజేస్తున్న బుద్ధ శివాజీ తదితరులు

అల్లిపురం: ప్రేమ సమాజం పేద గిరిజనులకు సహాయం చేసే విషయంలో ముందుంటుందని అధ్యక్షుడు బుద్ధ శివాజీ అన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను ఆశ్రమంలో చేరిస్తే వారికి చక్కటి భవిష్యత్తు కల్పిస్తామని తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో అరకు వ్యాలీ చుట్టు పక్కల సుమారు వెయ్యి మంది పేద గిరిజనులకు రగ్గులు, దుప్పట్లు, లీటర్ వంట నూనె, కేజీ బంగాళాదుంపలు అందించారు. అక్కడి నవజీవన్ బాయ్స్, గర్ల్స్ హాస్టల్, అన్నపూర్ణ హాస్టల్లోని సుమారు 150 మంది విద్యార్థులకు దుప్పట్లు, రేషన్ సరకులు అందించారు. అరకు మండలం, మాడగడ పంచాయతీ, తాంగుడుగుడ గ్రామంలో పేద గిరిజనులకు రేషన్ సరకులు అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ఎటువంటి ఆసరా లేని వృద్ధులను ప్రేమ సమాజంలో చేర్పిస్తే ఆశ్రయం కల్పించి వైద్య సదుపాయం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ సమాజం ఉపాధ్యక్షుడు కేశప్రగడ నరసింహమూర్తి, అడ్వైజర్ డాక్టర్ పి.విశ్వేశ్వరరావు, కోశాధికారి ఎంవీవీకే గుప్త, సంయుక్త కార్యదర్శులు మోహన్‌రావు, సురేష్‌కుమార్, గౌరీ ప్రసాద్, మాజీ కార్యదర్శి పి.గణపతిరావు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా అందించాలి

అల్లిపురం: ముస్లింలకు రంజాన్ తోఫా అందించాలని జనసేన ముస్లిం మైనార్టీ నాయకుడు సయ్యద్ ముస్తఫా కోరారు. ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపకుడు రాజుగౌడ్ పాత నగరంలో రంజాన్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వం రంజాన్ తోఫా అందించిన సంగతి గుర్తు చేశారు. ఇప్పటికే రంజాన్ సందర్భంగా ముస్లిం ఉద్యోగులు నమాజ్ చేసుకునేందుకు గంట అనుమతి ఇచ్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

మెగా డీఎస్సీ విడుదలకు ఏఐవైఎఫ్ డిమాండ్



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్

అల్లిపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా మెగా డీఎస్సీ విడుదల చేయకపోవడంపై అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ విడుదల చేస్తామని మోసపూరిత హామీతో అధికారంలోకి వచ్చిందన్నారు. అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ స్థాపించి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర కోశాధికారి వై.రాంబాబు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో పరిశ్రమలకు అనేక సౌకర్యాలు ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన పరిశ్రమల ఏర్పాటు దిశగా అడుగులు వేయడం లేదని ఆరోపించారు. ఉత్తరాంధ్ర యువత ఉపాధి అవకాశాలు లేక విదేశాలకు తరలి పోతున్నారని అన్నారు. కేంద్ర, పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకుని నూతన పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. లేని పక్షంలో వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలను కలుపుకుని ఉధృత ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు వి.రాజు, వి.కన్నబాబు, బి.వాసు, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న వాసుపల్లి



కనకమహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న వాసుపల్లి

అల్లిపురం: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ఆశీర్వచనాలు అందజేసి, ప్రసాదాన్ని అందించారు.

వాసుపల్లికి మక్బూద్ అహ్మద్ కృతజ్ఞతలు



వాసుపల్లితో మక్బూద్ అహ్మద్ తదితరులు

మహారాణిపేట: ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ జహీర్ అహ్మద్ కుమారుడు మక్బూద్ అహ్మద్ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సెక్రటరీగా తనను నియమించడం పట్ల ఆయన వాసుపల్లికి కృతజ్ఞతలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ తనకు సముచిత స్థానం కల్పించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏ వర్గానికీ న్యాయం చేయలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, 42వ వార్డు అధ్యక్షుడు భీశెట్టి ప్రసాద్, సాగర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం అధ్యక్షురాలిగా పద్మావతి



అల్లిపురం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం మున్సిపల్ విభాగం అధ్యక్షురాలిగా 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు తోట పద్మావతి మాట్లాడుతూ పార్టీ అధినేత తనపై నమ్మకంతో తనను బాధ్యతాయుతమైన పదవిలో నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

పరిశోధనలతోనే పలు అంశాలకు పరిష్కారం



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

అల్లిపురం: అంటువ్యాధుల పరిష్కారమే లక్ష్యంగా విద్యార్థులు పరిశోధనలు చేయాలని, పరిశోధనలతో పలు అంశాలకు పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మంజుల అన్నారు. మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం కళాశాల మీటింగ్ హాల్లో జరిగిన న్యూ ఫ్రాంటైస్ ఇన్ మైక్రోబయాల్ పేతాజిన్సిస్ అనే అంశంపై జరిగిన వర్క్‌షాపును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు వర్క్ షాప్ నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మలేరియా బయాలజీ గ్రూపు లీడర్ డాక్టర్ పవన్ మల్‌హోత్రా, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ జనీంద్రకుమార్ బాత్ర, ఐసీఎంఆర్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.ఎ.రాజు బగాది, స్టాఫ్ సైంటిస్ట్ డాక్టర్ రూపేంద్ర కుమార్ విద్యార్థులకు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సబ్బవరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎ.జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, మైక్రో బయాలజీ అధ్యాపకురాలు డాక్టర్ టి.వరలక్ష్మి, డాక్టర్ లక్ష్మణ్ నాయుడు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కుటుంబ ఆత్మీయ కలయిక ఉత్సవం



విద్యార్థులు, తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు

మహారాణిపేట: ఆశీల్‌మెట్ట శ్రీ చైతన్య పాఠశాలలో నాలుగు రోజుల కార్యక్రమమైన కుటుంబ ఆత్మీయ కలయిక ఉత్సవం ఘనంగా జరుగుతోంది. గురువారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జోనల్ అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ రామారావు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసికార్యక్రమాన్నిప్రారంభించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ కె.నాగేశ్వరరావు, ఉత్తరాంధ్ర శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం ఎం.వి.సురేష్, విశాఖ రీజినల్ ఇన్‌చార్జి అహ్మద్ అలీ, జోనల్ అకడమిక్ కో– ఆర్డినేటర్ ఎల్.రాజేష్, జోనల్ అకడమిక్ అసిస్టెంట్ కో– ఆర్డినేటర్ రామారావు, డీన్ మాధవ నాయుడు, అసిస్టెంట్ డీన్ విజయ్‌కుమార్, సి–ఇన్చార్జి శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రతి ఒక్కరూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడంతో కాన్సర్ మహమ్మరిని ముందుగా గుర్తించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం రేసవానిపాలెంలోని తన కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖకు చెందిన ప్రోగ్రాం అధికారులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులను ఉద్దేశించి మాట్లాడారు. గత నెల 20 నుంచి ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సిబ్బంది క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అలాగే ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా నేషనల్ కమ్యూనికల్ డీసెజెస్ నివారణ కార్యక్రమం, జనాభా అధారిత స్క్రీనింగ్ ప్రోగ్రాం, మధుమేహం, అధిక రక్తపోటు, సాధారణ క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖకు చెందిన పలు విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న అగ్నిమాపక శాఖ ప్రాంతీయ అధికారి నిరంజన్ రెడ్డి

మహారాణిపేట: హోటళ్లలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకునే భద్రత అతిథులు, సిబ్బంది శ్రేయస్సు పట్ల ఆయా సంస్థలు తీసుకునే శ్రద్ధను నిర్ధారిస్తాయని ప్రాంతీయ అగ్నిమాపక అధికారి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఆంధ్రప్రదేశ్ టూరిజం ఫోరం సంయుక్తంగా గ్రీన్ పార్క్ హోటల్లో నిర్వహించిన అగ్నిమాపక భద్రతా శిఖరాగ్ర సమావేశాన్ని జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. సదస్సులో పాల్గొన్న వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. హోటల్ టూరిజం సబ్ కమిటీ చైర్మన్ ఎంవీ పవన్ కార్తీక్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఏపీ టూరిజం ఫోరం కార్యదర్శి కార్తీక్ హాజరైన వారికి కృతజ్ఞతలు తెలిపారు. చీఫ్ ఇంజినీర్లు, స్టార్ హోటళ్ల భద్రత ఇన్‌చార్జిలు, ఫైర్ ట్రైనర్ ఎస్పీబీ రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై నడకతో ప్రమాదాలు

మురళీనగర్ : రహదారుల్లో నడవడం ద్వారా కోరి ప్రమాదాలు తెచ్చుకోవద్దని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్ అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'నడవండి – నడిపించండి' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యం అందంచే పార్కుల్లో నడక ఎంతో మంచిదని వాకర్లకు ఆయన తెలిపారు.